క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: మండలంలోని పెద్దనంతపురం గ్రామంలో సేవాలాల్ మరెమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.70 వేలు విరాళం అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విరాళ మొత్తాన్ని దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, పట్టణఅధ్యక్షుడు సయ్యద్‌మీర్, విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, సుల్తాన్ పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు గ్యాస్ సిలిండర్లలోడుతో వెళ్తున్న లారీకి ఘాట్ రోడ్డులోని చింతమాను టర్నింగ్ వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కొండచరియను ఢీకొట్టింది.అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు కారులో విజయవాడ నుంచి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు.

రోడ్డు నిర్మాణానికి ఆదేశాలివ్వండి

జూపాడుబంగ్లా: భారీ వాహనాలు తిరగటం వల్ల ధ్వంసమైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయటంతో పాటు ఆదేశాలివ్వాలని పోతులపాడు ఉపసర్పంచ్ శివానందరెడ్డి కోరారు. పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను పరిశీలించటానికి వచ్చిన ఈఎన్‌సీ నారాయణ రెడ్డిని కలిసిన ఆయన రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని గ్రామానికి, హెడ్‌రెగ్యులేటర్ వద్దకు చేరుకునేందుకు ప్రయాణికులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నూతన రోడ్డు నిర్మాణం పనులు మంజూరు చేయటంతో పాటు రోడ్డును వెడల్పుగా నిర్మించేలా ఆదేశాలు జారీచేయాలని వినతి పత్రం అందజేశారు.

నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతుల నిమిత్తం రూ.2లక్షలను జిల్లా పరిషత్ ఉమెన్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, పగిడ్యాల జెడ్పీటీసీ పుల్యాల దివ్య మంజూరు చేశారని పి.లింగాపురం గ్రామ సర్పంచ్ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం శిథిలమైన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే రూ.2లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో కేంద్రానికి త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.


లెనిన్‌కు నివాళి



లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: లెనిన్ జయంతి సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్‌ను స్ఫూర్తిని తీసుకోవాలని కోరారు. నాయకులు గోపాల్, ప్రేమరాజు, వెంకటేశ్వరగౌడ్, గోవింద్, శేఖర్, తిమ్మన్న, మునిస్వామి, రాజు, కిరణ్, మౌలాలి, పందు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలో తీగలను సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలు, వర్షానికి గువ్వలకుంట్ల గ్రామ ఎస్సీ కాలనీలో చెట్లు విరిగిపడి, విద్యుత్ స్తంభాలు విరగడంతో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఆ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి స్తంభాలు, తీగలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవడంతో సిబ్బంది వాటిని బాగు చేశారు. ఒక్క రోజులోనే విద్యుత్ సరఫరా చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



నందికొట్కూరు తబ్లిక్ జామద్ మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాములపాడులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



తిమ్మాపురంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఘనంగా రంజాన్ పండుగ

నందికొట్కూరు: పట్టణంలోని ముస్లింలు రంజాన్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్ ఇచ్చిన విందులో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, రవూఫ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టౌన్ సీఐ విజయభాస్కర్,ఎస్‌ఐ ఎన్వీ రమణ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న వారికి, పేద వారికి చేతనైనంత సహాయం చేసి ఆదుకుంటే అల్లాకు సేవ చేసినట్లవుతుందని ముస్లిం మతగురువులు పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు,మండ్లెం, తంగడంచ, 80బన్నూరు, తరిగోపుల,పారుమంచాల,తూడిచెర్ల తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మిడుతూరు: మండల కేంద్రంతో పాటు కడుమూరు, చౌట్కూరు, చెరుకుచెర్ల, తలముడిపి, తిమ్మాపురం, దేవనూరు, పీరుసాహెబ్ పేట, మాసపేట, కలమందలపాడు, పైపాలెం, వీపనగండ్ల, నాగలూటి తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మతపెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు.

ఆత్మకూరు: పట్టణంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే నూతన వస్త్రాలను ధరించి ఆయా ప్రార్థనాల మందిరాల్లో ముస్లింలు ఈదుల్ ఫితర్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు, మౌలానాలు ఖురాన్ సందేశాన్ని, రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. నంద్యాల టర్నింగ్ వద్ద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ ,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, నాయకులు మునీర్‌బాషా, విజయచౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు కురుకుంద శంకర్‌రెడ్డి, సురేష్, పువ్వాడ భాస్కర్, రాజగోపాల్, కోట్ల నాగేశ్వరరెడ్డి, అల్లిబాషా, విజయ్, హరి, యునస్, రమణ,ఫరుక్, ఫయాజ్, సుల్తాన్, కలీముల్లా, ప్రకాష్, ముర్తుజా పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు రాజశేఖర్, రణధీర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

మహానంది: రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె, అబ్బీపురం, బుక్కాపురం, తమ్మడపల్లె, బొల్లవరం, గోపవరం, సీతారామాపురం, మసీదుపురం, నందిపల్లె, అల్లినగరం, శ్రీనగరం, తదితర గ్రామాల్లో ముస్లింలు ఉదయం నుంచే వేడుకలు చేసుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతప్రవక్తలు ఖురాన్ బోధనలు, మహమ్మద్ ప్రవక్త సందేశాలను వినిపించారు.

పగిడ్యాల: మండలంలో ముస్లింలు శనివారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత గురువులు ఖురాన్ లేఖనాలను చదివి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఎస్‌ఐ నాగార్జున బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాములపాడు: రంజాన్ పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు పండుగ విశిష్టతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ దైవచింతనలో గడపాలని పేర్కొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కొత్తపల్లి: మండలంలోని ముస్లింలు శనివారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత పెద్దలు ఖురాన్ బోధనలు, ప్రవక్త సందేశాన్ని వినిపించారు. చెంచుమహిళా సమాఖ్య కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ యూసుఫ్ పాలెంచెరువు గ్రామానికి చెందిన గువ్వమ్మ, గురువన్న అనే దంపతులకు ఇంటికి ఆహ్వానించి వారితో కలసి కుటుంబ సమేతంగా భోజనం చేసి, నూతనవస్త్రాలను అందజేశారు.

వెలుగోడు: నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు దీక్ష విరమించి రంజాన్ పర్వదినాన్ని శనివారం అత్యంత వేడుకగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గా మైదానంలో, ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు వారికి ఖురాన్ సందేశాన్ని అందించారు.షాదీఖానాలో ప్రార్థనలు పూర్తి చేసుకుని కలువ పువ్వు సెంటర్‌కు చేరుకొని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఖురాన్ బోధనలను మత పెద్దలు వివరించారు.



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆర్థర్



జూపాడుబంగ్లాలో ఖురాన్ సందేశాన్ని వినిపిస్తున్న మతగురువు



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐ నాగార్జున



శివపురం సమీపంలో దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గిరిజన కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న చెంచుమహిళా సమాఖ్య కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ యూసుఫ్

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, దువసిపల్లె గ్రామానికి చెందిన ఉప్పల శివకుమార్ (32)అనే వ్యక్తి పాముకాటుకు గురై చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపిన వివరాల మేరకు.. శివకుమార్ డోజర్ నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. అందులో భాగంగా పారుమంచాల గ్రామానికి చెందిన శీను పొలాన్ని డోజరుతో చదును చేయటానికి ఆపరేటర్‌గా వచ్చాడు. ఈనెల 17న పొలాన్ని డోజరుతో చదును చేసిన అనంతరం సమీపంలోని బుడంతోట్ల వాగులో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకొనేందుకు వెళ్లాడు. వాగులో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉప్పల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. కాగా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో భక్తుల సందడి



నరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉభయ కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,13,433లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన గోపాల్‌రెడ్డి, శకుంతల దంపతులు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,00,116 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళ్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ వద్ద చెత్తకుప్పలో శనివారం ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. సాయిబాబానగర్ వద్దనున్న చెత్తకుప్పలో ఆడశిశువు మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి విషయాన్ని ఐసీడీఎస్ అధికారులకు తెలియజేయగా వారు శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

2.2 మి.మీ వర్షపాతం నమోదు



వీరాపురం సమీపంలో ఈదురు గాలలకు నేలవాలిన అరటితోట

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, గోకవరం, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 2.2 మి.మీల వర్షపాతం నమోదైందని ఏఎస్‌ఓ రమేష్ శనివారం తెలిపారు. ఎక్కువగా వర్షం పడకపోయినా తీవ్రమైన ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల ధాటికి ఆయా గ్రామాల్లో అరటి తోటలు నేలవాలాయి. దీంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూపాడుబంగ్లా: వేసవి ఎండల తీవ్రత నుంచి అల్లాడిపోతున్న ప్రజలు తెల్లవారుజామున కురిసిన చిరుజల్లులతో కాస్త ఉపశమనం పొందారు. శనివారం తెల్లవారుజామున మండలంలోని వివిధ గ్రామాల్లో 5.4 మి.మీ. వర్షపాతం నమోదైందని ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరులో అత్యధికంగా 8.6 మి.మీ., వర్షపాతం నమోదు కాగా పగిడ్యాలలో అత్యల్పంగా 1.2 మి.మీ. వర్షపాతం నమోదైందని చెప్పారు. పాములపాడులో 5.4 మి.మీ., నందికొట్కూరులో 4.6 మి.మీ., వెలుగోడులో 3.8 మి.మీ., ప్రకారం వర్షపాతం నమోదైందని వివరించారు. కాగా వర్షం రాకతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయిందని రైతుల వాపోయారు.

- దేశంలో ఏ ఆలయానికి లేని విధంగా 4,400 ఎకరాల భూమి కేటాయింపు
- పార్టీ మారుతున్నానని టీడీపీ అసత్య ప్రచారం చేస్తుంది
- పౌర సన్మాన సభలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

శ్రీశైలం మరింత అభివృద్ధి



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న శ్రీశైలం వాసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. మల్లన్నకు చెందిన భూములు ఉన్నా, ఎన్నో దశాబ్దాలుగా గతంలో పాలకులు పట్టించుకోలేదు. స్వామి ఆశీస్సులతో సంకల్పం చేసుకుని ఆ భూములు మల్లన్నకే చెందేలా చేయడం సంతోషంగా ఉందన్నారు. దేవస్థాన భూములు ఆలయానికి చెందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు శ్రీశైలం వాసులు పౌరసన్మాన కార్యక్రమాన్ని శనివారం స్థానిక వాసవీసత్రంలో ఏర్పాటు చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం తరపున ఎమ్మెల్యేకు అధికారులు, అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. శ్రీశైల క్షేత్రానికి 4,400 ఎకరాల భూమిని సాధించడంపై అభినందనలు తెలిపారు. అలాగే స్థానికులు ఆయనను శాలువాలు, పూలమాలలు,గజ మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శిల్పా నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తుంటారని చెప్పారు. ఆయన తమ్ముడిని అయినందుకు గర్వంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రంలో ఏ ఒక్క చిన్న అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా అటవీశాఖ అధికారులతో అడ్డంకులు ఎదురయ్యేవని, వీటిని ఏలా అధిగమించాలనే ఆలోచన నుంచి పుట్టిందే శ్రీశైల భూముల విషయమన్నారు. అసలు క్షేత్రానికి ఎన్ని ఎకరాల భూమి ఉంది అనే విషయంపై పలు రికార్డులను పరిశీలించామన్నారు. అసలు అటవీశాఖ వద్ద ఉన్న రికార్డులు ఏంటని ప్రశ్నించి, నేను సేకరించిన రికార్డులను పరిశీలించి సీఎం సూచనతో అటవీ, రెవెన్యూ, దేవదాయశాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేశామని, ఈ సమావేశంలో కూలంకుషంగా చర్చించిన తరువాత ప్రాథమికంగా 5,302 ఎకరాలు శ్రీశైలానికి చెందినదని నిర్ధారించినట్లు పేర్కొన్నారు. అటుతరువాత ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌తో సర్వే చేయించి ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించామని తద్వారా శ్రీశైల క్షేత్రానికి సంబంధించి 4,400 ఎకరాల భూమి ఉందని నిర్ధారణ చేసుకుని అటవీశాఖ నుంచి అనుమతులు కూడా ఇప్పించానని వివరించారు. అటవీశాఖ మంత్రి పెద్దిరామచంద్రారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దుకాణాల తొలగింపు విషయంలో వ్యాపారులే కోర్టులకు వెళ్లారని, తనకు మాత్రం దుకాణాలు తొలగించే ఉద్దేశంలేదని, విధిలేని పరిస్థితుల్లో చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, రెడ్ల సమాఖ్య అధ్యక్షుడు తాతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు మార్కండేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణు, ఏడుకొండలు, కృష్ణమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, టీఎండీ.రఫీ, నటరాజ్, జిల్లెల లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సన్మానం కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు

టీడీపీ అసత్య ప్రచారం చేస్తుంది..

తాను విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తినని, దేశంలోనే ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీ పదవిని తృణపాయంగా వదులుకున్న వ్యక్తినని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిబద్ధత, నమ్మకం గల ముద్ర వేసుకున్న వ్యక్తిని పార్టీ ఎందుకు మారుతానని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లాలనే నాపై పార్టీ మారుతున్నట్లు టీడీపీ అసత్య ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. టీడీపీ చచ్చిపోయిన పార్టీ అని, దింపుడు కళ్లం వద్ద ఉంచి బితికించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: కృత్తిక నక్షత్రం సందర్భంగా శనివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

మద్దిలేటిస్వామి ఆలయ ధ్వజ స్తంభానికి పూజలు



బేతంచెర్లలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో సుమారు రూ. 4 కోట్లతో చేపట్టిన పునర్నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆలయం ముందు నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఓర్వకల్లు మండలం, కొంతల పాడు గ్రామానికి చెందిన మద్దయ్య రూ. 4.50 లక్షలు విరాళం ఇచ్చారు. గుంటూరు జిల్లా, చెరుకుపల్లె నుంచి 57 అడుగుల టేకు ధ్వజస్తంభాన్ని శనివారం బేతంచెర్ల మీదుగా ఆలయానికి తరలించారు. ఈ మేరకు ధ్వజస్తంభానికి విశ్వహిందూ పరిషత్, హిందూ సోదరులు, ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, వేదపండితులు జ్వాలాచక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడుమద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మల్లు హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.